ప్రజాశక్తి
మంగళవారం 22 ఏప్రిల్ 2025
5
అల్లూరి సీతారామరాజు

ప్రభుత్వ స్థలంలో అక్రమ కట్టడాలు కూల్చాలి

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: మండలంలోని సుంక రమెట్ట పంచాయితీ కేంద్రంలో వారపు సంత జరిగే ప్రభుత్వం స్థలంలో బినామీ పేరుతో గిరిజనేతరుడు నిర్మిస్తున్న అక్రమ కట్టడాలు వెంటనే నిలుపుదల చేసి కూల్చాలని సిపిఎం నేతలు సోమవారం తహాశీల్దార్ కార్యాలయంలో సిబ్బందికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి కె రామారావు మాట్లాడుతూ, సంత జరుగు స్థలంలో పంచాయితీ, రెవిన్యూ నుండి ఎటువంటి అనుమతులు లేకుండా చట్ట విరుద్ధంగా బినామీ పేరుతో గిరిజనేతరుడు నిర్మిస్తున్న అక్రమ కట్టడాలపై పిర్యాదులు చేసినా చర్యలు తీసుకోలేదని తెలిపారు. సిపిఎం నాయకులు, నాని బాబు, గురుమూర్తి, పి.రామన్న, ప్రసాద్ పాల్గొన్నారు.

వినతిపత్రం ఇస్తున్న నేతలు

గిరిజనాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట

-గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి- పలు సమస్యలపై నిలదీసిన ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: గిరిజనాభివృద్ధికి, సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని జిల్లా ఇంచార్జి మంత్రి, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణి స్పష్టం చేసారు. అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు ఐటిడిఎ 74వ పాలకవర్గ సమావేశం 33 నెలల సుదీర్ఘ విరామం తర్వాత సోమవారం కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ అధ్యక్షతన ఐటిడిఎ సమావేశ మందిరంలో నిర్వహించారు. వైద్య ఆరోగ్యశాఖ, విద్య, గిరిజన సంక్షేమ శాఖపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..గిరిజన సంక్షేమ శాఖను ప్రక్షాళన చేస్తున్నామని పేర్కొన్నారు. గంజాయి నిర్మూలనకు రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. 6 ఐటిడిఎల పరిధిలో రూ.6 కోట్ల తో స్మార్ట్ బజారు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మెగా డీఎస్ సిని ఎట్టి పరిస్థితిలో పూర్తి చేస్తామన్నారు. ఉపాధ్యాయ నియామకాల్లో గిరిజన నిరుద్యోగ యువతకు అన్యాయం జరగదని స్పష్టం చేసారు. 11 విద్యా సంస్థలను రూ.34 కోట్లతో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని చెప్పారు. మిగిలి విద్యా సంస్థల్లో మౌలిక సదుపాయాలకు రూ.132 కోట్ల నిధులు అవసరం ఉంటుందన్నారు. గిరిజన విద్యార్థుల మరణాలు, ఆరోగ్యం, పౌష్టికాహారంపై ఐటిడిఎ పిఒ తనిఖీ చేయాలని సూచించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో రూ.450 కోట్లతో రహదారులు నిర్మిస్తున్నామన్నారు. రూ.25 కోట్లతో 35 మల్టీ పర్పస్ సెంటర్లను నిర్మిస్తున్నామని చెప్పారు. పలువురు సభ్యులు సూచనల మేరకు గిరిజనేతరులకు గిరిజన కులదవీకరణ పత్రాలు జారీ చేయకుండా జిల్లా కలెక్టర్లు దష్టి పెట్టాలని పేర్కొన్నారు. ఎస్ సి ఎస్ టి వర్గాలు పిఎం సూర్యఘర్ ఉచిత సోలార్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ మాట్లాడుతూ ఐటిడిఎ పరిధిలో జరుగుతున్న అభివద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. అరకువ్యాలీలో రక్త నిధిని ఏర్పాటు చేయడానికి అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. పాడేరులో డ్రగ్ స్టోరు ఏర్పాటు చేస్తామన్నారు.

అరకు ఎంపి గుమ్మా తనూజారాణి మాట్లాడుతూ ఎంపి లాడ్స్ నుండి 11 అంబులెన్సులు మంజూరు చేస్తామని ప్రకటించారు. అరకు ఏరియా ఆసుపత్రిలో పిడియాట్రిషియన్లను నియమించాలన్నారు. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి, చోడవరం ఎమ్మెల్యే. కెఎస్ఎన్ఎస్ రాజు మాట్లాడుతూ సబ్ ప్లాన్ మండలాల గిరిజనులకు ఐటిడిఎ ఫలాలను అందించాలని కోరారు. పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు మాట్లాడుతూ జిఒ-3కి ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయాలన్నారు. 1/70 చట్టాన్ని సమర్ధవంతంగా అమలు చేయాలని చెప్పారు.

అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో అక్రమ కట్టడాలు నిర్మూలించి ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. జిసిసి చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ సికిల్ సెల్ ఎనిమియా వంశపారపర్యంగా సంక్రమిస్తుందని సికిల్ సెల్ ఎనిమీయాపై గిరిజనులకు అవగాహన కల్పించాలని, తగిన వైద్యం అందించాలని చెప్పారు. ముందుగా ఐటిడిఎ వీడియో కాన్ఫరెన్స్ హాలులో గర్భిణీలకు సీమంతాలు, చిన్నారులకు అన్న ప్రాసన మంత్రి చేతుల మీదగా నిర్వహించారు. ఎమ్మెల్సీ కుంభా రవిబాబు, జడ్ పి చైర్మన్ జల్లిపల్లి సుభద్ర, అనకాపల్లి కలెక్టర్ విజయ క్రిష్ణన్, ఐటిడిఎ ఇంచార్జి పిఒ, జెసి ఎంజె అభిషేక్, సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, డిఎఫ్ఒ పివి సందీప్ రెడ్డి, ఆర్ టిసి చైర్మన్ దొన్నుదొర, ఐటిడిఎ ఎపిఒలు ఎం.వెంకటేశ్వరరావు, వివిఎస్ ప్రభాకరరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, జెడ్పిటిసిలు, ఎంపిపిలు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతునన మంత్రి సంధ్యారాణి

ప్రజా సమస్యలపై గళమెత్తిన గంగరాజు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఐటిడిఎ సమావేశంలో వివిధ సమస్యలపై అనంతగిరి జడ్పిటిసి దీసరి గంగరాజు (సిపిఎం) తన గళాన్ని వినిపించారు. ఏజెన్సీ ప్రాంతల్లో స్థానిక ఆదివాసీలకే 100శాతం ఉద్యోగాలు కల్పించే జిఒ-3 ప్రయోజనాలను కాపాడుతూ ప్రత్యామ్నాయ జిఒ తీసుకొచ్చి ఉద్యోగ నియామకాల్లో గిరిజనులకు న్యాయం చేయాలన్నారు. జిఒ-3 ప్రయోజనాల చట్టబద్ధతకు పాలకవర్గ సమావేశంలో తీర్మానం చేయాలన్నారు. సిహెచ్ డబ్ల్యూలు, ఆశా వర్కర్ల పనికి వ్యత్యాసం లేనప్పటికీ సిహెచ్ డబ్ల్యూలకు రూ.4వేలు, ఆశలకు రూ.10వేలు వేతనం ఇస్తున్నారని, పాడేరు డివిజన్ లో 720 మంది సిహెచ్ డబ్ల్యూలను ఆశాలుగా మార్చాలని డిమాండ్ చేశారు. అనంతగిరి మండలంలో ఆరోగ్యపరంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించి వాటిని పరిష్కరించాలని విన్నవించారు. పిహెచ్‌సిల్లో విధులు నిర్వహిస్తున్న అంబులెన్స్ డ్రైవర్లకు ఐటిడిఎ ద్వారా జీతాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని, గర్భిణీల కోసం పిహెచ్ సిల్లో స్కానింగ్ సెంటర్ లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతగిరి మండలంలో రోడ్డు పనుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్ మెంట్ లో పనిచేస్తున్న వర్క్ ఇన్స్పెక్టర్ ను అక్కడ నుంచి వేరే ప్రాంతానికి పంపాలన్నారు. ఏజెన్సీలో రోడ్డు నిర్మాణాలకు ఫారెస్ట్ డిపార్ట్ మెంట్ అనుమతులు ఇవ్వాలని కోరారు. వీటిపై స్పందించిన గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి, జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ఆయా సమస్యల పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

ప్రశ్నిస్తున్న జెడ్పిటిసి గంగరాజు

ప్రశ్నిస్తున్న ప్రజాప్రతినిధులు

సమస్యలపై నిలదీసిన ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఐటిడిఎ 74వ పాలకవర్గ సమావేశం సోమవారం వాడీవేడిగా జరిగింది. గిరిజన ప్రాంతంలోని ప్రజాప్రతినిధులు వైసీపీకి చెందినవారు కావడంతో సమావేశంలో అనేక సమస్యలపై నిలదీశారు. జిఒ-3కి ప్రత్యామ్నాయ జిఒ చట్టబద్ధతకు, గిరిజన స్పెషల్ డిఎస్సి నోటిఫికేషన్ జారీ చేయాలని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణిని నిలదీశారు.ఇరువురి మధ్య కొంతసేపు తీవ్ర వాగ్వివాదం చోటుచేసుకుంది.

యుటిఎఫ్ ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

యుటిఎఫ్ ఆధ్వర్యాన 'ఊరు బడి కోసం పోరుబాట'

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఊరి బడి కోసం పోరుబాట కార్యక్రమం ఆ సంఘం రాజవొమ్మంగి మండల శాఖ ఆధ్వర్యాన సోమవారం పలు గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి శ్రీను మాట్లాడుతూ ప్రభుత్వ బడిని కాపాడుకోడానికి ఊరి బడి కోసం-పోరు బాట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గ్రామాల్లో ఐదేళ్లు నిండిన పిల్లలను బడిలో చేర్పించాలని, ప్రభుత్వ బడిలోనే విద్యార్థికి కావలసిన అన్ని సౌకర్యాలు ఉచితంగా కల్పిస్తున్నారని, విద్యార్థి భవిష్యత్తులో ఉన్నత స్థితిని చేరుకోవడానికి సుశిక్షితులైన ఉపాధ్యాయులతో బోధన జరుగుతుందని తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. అలాగే తల్లికి వందనం పథకం కింద ప్రతి విద్యార్థికి రూ.15వేలు అందిస్తుందని, విశాలవంతమైన తరగతి గదులు, మూడు జతల యూనిఫామ్, షూలు, స్కూల్ బ్యాగ్, పాఠ్య, నోట్ పుస్తకాలు ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందని చెప్పారు. అలాగే మధ్యాహ్నం భోజనం, వారానికి ఐదు రోజులు గుడ్లు, మూడు రోజులు చిక్కిలు, మూడు రోజుల రాగిజావ అందిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేసిందుకు, పేదవారికి విద్య ఉచితంగా అందించేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల తల్లిదండ్రుల కమిటీ సభ్యులు, అంగన్వాడి కార్యకర్తలు, ఉపాధ్యాయులు కానెం శ్రీను, ఎం.రమేష్, డి. పైడిమల్లి, ఏ.సతీష్, జె.వెంకటరాజు, ఎం రమణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

నదిలో బోటులో వెళ్లి గాలిస్తున్న దృశ్యం

గల్లంతైన యువకుల కోసం ముమ్మరంగా గాలింపు

- 24 గంటలైనా తెలియని ఆచూకీ

ప్రజాశక్తి -చింతూరు

మండలంలోని సీలేరు నది ప్రవాహంలో ఆదివారం గల్లంతైన ఇద్దరు యువకులు దిలీప్, శ్రీనివాసుల కోసం అధికారులు, ఎన్‌డిఆర్ బృందం వారు సోమవారం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. 24 గంటలు కావస్తున్న వారి ఆచూకీ తెలియకపోవడంతో తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వారి కోసం బంధువులు స్నేహితులు ఘటన స్థలం వద్దనే ఎదురుచూస్తున్నారు. చింతూరు ఐటిడిఎ పిఒ అపూర్వ భరత్, తహాశీల్దారు చిరంజీవి, ఎస్సై రమేష్, విఆర్ఓ సిబ్బంది ఎప్పటికప్పుడు గాలింపు చర్యలను పరిశీలిస్తున్నారు. ప్రముఖ ఆయుర్వేద వైద్యులు జెకె సిటీ ట్రస్ట్ చైర్మన్ జమాల్ ఖాన్ బాధితుల కోసం భోజన సదుపాయాన్ని కల్పించి మండుటెండలో ఇబ్బందులు పడుతున్న బంధువులకు తాగునీరు అల్పాహారం ఏర్పాటు చేశారు. ఆదివారం సాయంత్రం నుండి సోమవారం సాయంత్రం వరకు జమాల్ ఖాన్ యువకుల మృతదేహాల కోసం అధికారులతో పాటుగా సహాయ చర్యల్లో పాల్గొన్నారు.

డిఎస్‌సి అభ్యర్థులకు గ్రంథాలయాల్లో నెట్‌వర్క్, ప్రింటర్లు

ప్రజాశక్తి-రంపచోడవరం

ఏజెన్సీలోని డిఎస్‌సికి ప్రిపేర్ అయ్యే గిరిజన యువతీ యువకుల కోసం ప్రతి గ్రంథాలయంలో నెట్‌వర్క్, ప్రింటర్ల సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నట్లు రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు. స్థానిక ఐటిడిఏ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ గిరిజన యువతీ యువకులు ఈ డీఎస్సీలో ఎక్కువ టీచర్ల పోస్టులు పొందే విధంగా వారికి గ్రంథాలయాలలో ఈ సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. డీఎస్సీ అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మానవ హక్కుల పరిరక్షణపై శిక్షణ

ప్రజాశక్తి-అడ్డతీగల

జాతీయ మానవ హక్కుల పరిరక్షణ సంస్థ శిక్షణా తరగతులు అడ్డతీగలలో నిర్వహించడం జరిగింది. ముఖ్య అతిథులుగా సంస్థ సీఈవో తూము రామచంద్ర నాయుడు, నేషనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.మాధవీలత, ఎన్‌హెచ్‌ఆర్‌పి ఫోరం రాష్ట్ర ఇంచార్జ్ పిఏ.వలిఖాన్ హాజరయ్యారు. నియోజకవర్గ జనరల్ సెక్రటరీ ఏ రాంప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీఈఓ రామచంద్ర నాయుడు మాట్లాడుతూ సంస్థలో చేరిన ప్రతి ఒక్కరూ శిక్షణ పొంది అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కె మాధవీలత మాట్లాడుతూ భారత రాజ్యాంగంలోని అంశాలపై అవగాహన కలిగించినట్లు చెప్పారు. అనంతరం రామచంద్రనాయుడు, మాధవీలత చేతుల మీదుగా సభ్యులందరికీ శిక్షణ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ప్రేమ స్వరూప్, ముర్ల సూరిబాబు, పిట్ల ప్రభాకర్. మహిళా విభాగం ఇంచార్జ్ ఏ శ్రీదేవి, పలు మండలాల ప్రెసిడెంట్లు, వైస్ ప్రెసిడెంట్లు, సెక్రెటరీలు వర్కింగ్ ప్రెసిడెంట్లు 100 మందికి పైగా హాజరయ్యారు.

కార్యక్రమంలో పాల్గొన్న రామచంద్రనాయుడు, మాధవీల తదితరులు

ఆందోళన చేపడుతున్న మహిళలు

ఎస్ఐ తీరుపై.. గిరిజన మహిళలు ఆందోళన

ప్రజాశక్తి- పెదబయలు: మండలంలో ఇటుకల పండుగ సందర్భంగా పజోర్ వసూలు చేస్తున్న తమపై ఎస్ఐ దురుసుగా ప్రవర్తించారని గిరిజన మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు స్థానిక పోలీసు స్టేషన్ వద్ద సోమవారం ఆందోళన చేశారు. మహిళల కథనం మేరకు..మండల కేంద్రం సీతగుంటా పంచాయతి లో వారం రోజులుగా ఇటుకల పండగ జరుగుతుంది. ఈ నేపథ్యంలో సోమవారం వారపు సంతరోజున సీతగుంట పంచాయతి వివిధ గ్రామాల మహిళలు దారిన కాచి పజోర్ అడుగుతున్నారు. ముసిడిపుట్టు గ్రామానికి చెందిన మహిళలు గ్రామ సమీపంలో మెయిన్ రోడ్డుకు అడ్డంగా నిలబడి ఇరువైపులా తాడు కట్టి పజోర్ అడుగుతున్నారు. అదే సమయంలో పాడేరు నుండి పెదబయలు స్టేషన్‌కు వస్తున్న స్థానిక ఎస్ఐ కొల్లి రమణను పజోర్ అడిగారు. డబ్బులు మీకు ఎందుకివ్వాలని దురుసుగా ఎస్ఐ మాట్లాడారని మహిళలు ఆరోపించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించకుండా వెళ్లి పోవాలని ఎస్ఐ ఆదేశించగా ఇంతలో భాలన్న అనే గిరిజనుడు కలగజేసుకోవడంతో. ఎస్ఐ చెయ్యి. చేసుకున్నామని మహిళలు తెలిపారు. స్థానిక ఎంపిటిసి కే.బొంజుబాబు, సీపీఎం మండల కార్యదర్శి బి సన్నిబాబు పోలీసు స్టేషన్ కు చేరుకొని ఈ విషయం పై ఆరా తీశారు. ఎంపిటిసి కలుగ జేసుకొని సర్ది చెప్పి గ్రామస్తులను పంపించేశారు.

ఈ విషయమై ఎస్ఐ రమణ మాట్లాడుతూ, సంత రోజు కావడంతో వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుందని ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించ వద్దని చెప్పానని, ఎవరినీ చెయ్యి చేసుకోలేదని తెలిపారు.

ర్యాలీ చడుతున్న యుటిఎఫ్ నేతలు

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

ప్రజాశక్తి -అనంతగిరి: బడి ఈడు విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్నామని యుటిఎఫ్ అల్లూరి సీతారామరాజు జిల్లా అధ్యక్షులు పి దేముడు, ఉమ్మడి జిల్లా సహా అధ్యక్షులు సెట్టి రాంబాబు అధ్యక్షతన నిర్వహించారు మండలంలోని చిలకల గెడ్డ ప్రాథమిక మండల పరిషత్ పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో అవగాహన ర్యాలీ కార్యక్రమం చేపట్టమని అల్లూరి సీతారాముల జిల్లా యుటిఎఫ్ అధ్యక్షులు పి దేముడు ఉమ్మడి జిల్లా సహాధ్యక్షులు శెట్టి రాంబాబు ఆధ్వర్యన ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో మండల ప్రతినిధులు రఘు, ప్రసాద్, మల్లేష్ పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థుల క్రీడాభివృద్ధికి ప్రోత్సాహం

ఐటిడిఎ పిఒను కలిసిన రెజ్లింగ్ క్రీడాకారులు

ప్రజాశక్తి-రంపచోడవరం

ఏజెన్సీలోని గిరిజన విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లో అభివృద్ధి అయ్యే విధంగా ఐటిడిఎ తరుపున ప్రోత్సహించడం జరుగుతుందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు. రాజమండ్రిలో ఈనెల 4 నుండి 6వ తేదీ వరకు జరిగిన రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలలో ముసురుమిల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాల, కె.ఎర్రంపాలెం గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థులు గోల్డ్ మెడల్స్ సాధించారు. వీరంతా సోమవారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం, సబ్ కలెక్టర్ కెఆర్.కల్పశ్రీలను మర్యాదపూర్వకంగా కలిశారు. వీరిలో చొడి తబిత 30 కేజీల విభాగంలోనూ, కిరణ్ 42 కేజీల విభాగంలోనూ, భువన్ కుమార్ 38 కేజీల విభాగంలోనూ ఈ ఏడాది జూన్ 12 నుండి 15వ తేదీ వరకు రాజస్థాన్లో జరుగు జాతీయస్థాయి కుస్తీ పోటీలకు ఎంపికయ్యారు. అలాగే రాజమండ్రిలో జరిగిన రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలలో తుర్రం అస్మిత, సోడి సబిత, సోడి తబిత, కీర్తన, వీర ఆనందిత కూడా గోల్డ్ మెడల్స్ సాధించారు. ఈ సందర్భంగా ఐటిడిఎ పిఒ సింహాచలం మాట్లాడుతూ గిరిజన బాల బాలికలు జాతీయ స్థాయి కుస్తీ పోటీలకు ఎంపిక కావడం చాలా సంతోషకరమైన విషయమన్నారు. గిరిజన బాల బాలికలలు వివిధ రకాలైన ఆటల పోటీలలో జాతీయస్థాయిలో పోటీపడే విధంగా ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మాండయ్య, ఎపిఓ జనరల్ డిఎన్‌వి రమణ, ఎస్‌డిసి అంబేద్కర్, ఏజెన్సీ డీఈవో వై.మల్లేశ్వరరావు, డిఎల్‌డిఓ కే.కోటేశ్వరరావు, సహాయక గిరిజన సంక్షేమ శాఖ అధికారి రామ తులసి, ప్రధానోపాధ్యాయురాలు వై.లక్ష్మి, ఫిజికల్ డైరెక్టర్ కె.పోతురాజు, పిఈటి దూడ సుగంధి, కోచ్ రత్నరాజు, ఆదివిష్ణు తదితరులు పాల్గొన్నారు.

కుస్తీ పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ఐటిడిఎ పిఒ సింహాచలం, సబ్ కలెక్టర్ కల్పశ్రీ

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం

బాధిత కుటుంబానికి సర్పంచ్ సంతోష్‌కుమార్ పరామర్శ ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని విజ్ఞప్తి

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలంలో శ్రీరామగిరి పంచాయతీ పరిధి చొక్కనపల్లి గ్రామంలో ఆదివారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం చోటుచేసుకొని తోడం రాంబాబు నాగమణి దంపతుల పూరిల్లు దగ్ధమైంది. స్థానికులు మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. అగ్ని ప్రమాదం కారణంగా ఇంట్లో ఉన్న ఐదు క్వింటాలు వరి ధాన్యం, మిర్చి, ఇతర తిండి గింజలు, బట్టలు, వంట పాత్రులు, టివి, ఇతర గృహోపకరణాలు కాలిపోయాయి. విషయం తెలుసుకున్న శ్రీరామగిరి సర్పంచ్, సిపిఎం మండల కార్యదర్శి పులి సంతోష్‌కుమార్ సోమవారం సంఘటనా స్థలాన్ని సందర్శించి బాధితులను పరామర్శించారు. రెక్కాడితేగాని పొట్టనిండని పేద గిరిజన కుటుంబమని, బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. వీఆర్వో పంచనామా చేసి న్యాయం జరిగేలా చూడాలని కోరారు. బాధిత కుటుంబాన్ని సందర్శించిన వారిలో సిపియం మండల నాయకులు తోడం రాజు, మాజీ సర్పంచ్ తోడం చిన్న బూబమ్మ, పీసా కమిటీ కార్యదర్శి తోడం అనిల్, వార్డు సభ్యులు గొంది దారయ్య, సున్నం సీతమ్మ తదితరులున్నారు.

బాధితులను పరార్శిస్తున్న సర్పంచ్ పులి సంతోష్‌కుమార్, సిపిఎం నేతలు

పనులను పరిశీలిస్తున్న ప్రణవ్‌గోపాల్

డి డెక్ పనుల పరిశీలన

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ : వివిఎంఆర్‌డిఎకు చెందిన డి డెక్ (మల్టీ లెవెల్ కార్ పార్కింగ్ ప్రాంగణం), యు హెక్ 3 హెచ్ (హెలికాప్టర్ మ్యూజియం) లను విఎంఆర్‌డిఎ చైర్మన్ ఎంవి.ప్రణవ్‌గోపాల్ సోమవారం సందర్శించారు. త్వరలో ముఖ్య మంత్రి చంద్రబాబు చేతుల మీదుగా వీటిని ప్రారంభించనున్న నేపథ్యంలో సోమవారం ఈ రెండు ప్రాజెక్టులను సందర్శించి పలు సూచనలు చేశారు. మిగిలిన పనులు ఏమైనా ఉంటే ఈ నెల 26వ తేదీ నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ పర్యటనలో విఎంఆర్‌డిఎ జాయింట్ కమిషనర్ కె.రమేష్, కార్యదర్శి మురళీకృష్ణ, పర్యవేక్షక ఇంజినీర్లు భవానీశంకర్, బలరామరాజు, కార్యనిర్వాహక ఇంజినీర్లు మధుసూదన్, రామరాజు, దుర్గాప్రసాద్, సుదీర్, గుత్తేదారు సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

కెజిహెచ్ సూపరింటెండెంట్‌కు వైద్య పరికరాలను అందిస్తున్న సుంకర కుటుంబీకులు

కెజిహెచ్‌కు వైద్య పరికరాల వితరణ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : కెజిహెచ్ న్యూరో సర్జరీ విభాగంలో వినియోగం కోసం రూ.8 లక్షల విలువైన వైద్య పరికరాలను కీర్తిశేషులు డాక్టర్ సుంకర బాల పరమేశ్వరరావు (న్యూరో సర్జన్) కుమార్తె సుంకర ఆదిలక్ష్మి, కోడలు సుబ్బలక్ష్మి, మనవాళ్లుడాక్టర్ ఎస్‌జె.బాలపరమేశ్వరరావు (న్యూరో సర్జన్) సుంకర రాజగోపాల్ (ఐఎఎస్) సోమవారం అందజేశారు. వీటిని కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు కెజిహెచ్‌లోని న్యూరో సర్జరీ విభాగానికి ప్రముఖ న్యూరో సర్జన్ కీర్తిశేషులు డాక్టర్ సుంకర బాలపరమేశ్వరావు న్యూరో సర్జరీ వార్డుగా నామకరణం చేసినట్లు తెలిపారు. ఆయన జ్ఞాపకార్థం న్యూరో సర్జరీ విభాగానికి వైద్య పరికరాలను డాక్టర్ సుంకర బాలపరమేశ్వరరావు కుటుంబ సభ్యులు విరాళంగా ఇవ్వడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కెజిహెచ్ న్యూరో సర్జరీ విభాగాధిపతి డాక్టర్ ప్రేమ్‌జిత్‌రే తో పాటు, ఇతర న్యూరో సర్జరీ వైద్యులు పాల్గొన్నారు.

జేఈఈలో 'శ్రీ రామానుజ' అద్భుత ఫలితాలు

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ : విశాఖపట్నంలోని శ్రీ రామానుజ జూనియర్ కాలేజీ ఆధ్వర్యాన నడుస్తున్న శ్రీ రామానుజ ఐఐటి, ఎన్‌ఈఈటి అకాడమీ విద్యార్థులు ఇటీవల విడుదలైన ఫలితాల్లో అద్భుత ప్రతిభ కనబర్చారని కళాశాల ప్రిన్సిపల్ పేరు శివరామ దత్తాత్రేయ తెలిపారు. 2022 నుంచి 113 మంది ఎంపిసి విద్యార్థులలో 18 మంది ప్రఖ్యాత ఐఐటి - జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ర్యాంకులు సాధించారని తెలిపారు. జేఈఈ మెయిన్స్‌లో సంస్థ విద్యార్థులు వరుసగా 99.493, 98.709, 98.619, 96.660, 96.454, 95.421, సబ్జెక్టులవారీగా భౌతిక శాస్త్రం - 99.738, రసాయనశాస్త్రం 99.717, గణిత శాస్త్రం - 98.515 శాతంతో ఫలితాలు సాధించారని పేర్కొన్నారు. బయాలజీ స్ట్రీమ్‌లో 18 మందిలో 11 మంది ఎంబిబిఎస్, బిఎఎంఎస్, బిడిఎస్ సీట్లు పొందారని వివరించారు.

విద్యార్థులకు సదుపాయాల కల్పనే ధ్యేయం

ప్రజాశక్తి అరకులోయ రూరల్:విద్యార్థులకు మౌళిక సదుపాయాల కల్పనే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మరియు జిల్లా ఇంచార్జ్ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి స్పష్టం చేసారు. సోమవారం అరుకులోయలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధి పథంలో కీలక ముందడుగు వేసిందని చెప్పారు. డిగ్రీ కళాశాలకు అనుబంధంగా కోటి రూపాయల వ్యయంతో నిర్మించిన అదనపు భవనాలను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సంధ్యారాణి మాట్లాడుతూ, ఆదివాసీ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్న ఆలోచనతో ఈ నిర్మాణం చేపట్టడం జరిగిందని, అభివృద్ధి అనేది నగరాలకు మాత్రమే పరిమితం కాకూడదని గ్రామాలకు, గిరిజన ప్రాంతాలకు విస్తరించడం ద్వారా సమాజంలో సుస్థిర మార్పు వస్తుందన్నారు. ఆధునిక తరగతి గదులు, ల్యాబొరేటరీస్, గ్రంథాలయం తదితర అన్ని సౌకర్యాలు కల్పించడం జరిగిందని, కళాశాల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతమున్న భవనాన్ని ఇంజినీరింగ్ అధికారులతో పరిశీలింపజేసి అవసరమైతే మరమ్మత్తులు చేయిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్, జేసి, ఐటిడిఎ ఇంచార్జ్ పిఒ ఎంజే అభిషేక్ గౌడ్, సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, ఇంజినీర్ ఇన్ చీఫ్ ఎస్.శ్రీనివాసరావు, జిసిసి, ఆర్టిసి చైర్మన్లు కె శ్రావణ్ కుమార్, దొన్నుదొర, ఇఇ వేణుగోపాల్, ఎఇ ధ్రువకుమార్ పాల్గొన్నారు.

వంతెనను ప్రారంభించిన సంధ్యారాణి

దుంబ్రిగుడ:గిరిజనుల రవాణా సౌకర్యార్థం రూ 4 కోట్ల 40 లక్షలతో కించుమండ సంత బయలు సమీపంలోని పరిశీల రోడ్డు సంపంగి గెడ్డ వద్ద నూతనంగా నిర్మించిన వంతెనను గిరిజన సంక్షేమ శాఖ, స్త్రీ శిశు

గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి

డిగ్రీ కళాశాల అదనపు భవనాలను ప్రారంభిస్తున్న మంత్రి గుమ్మడి సంధ్యారాణి

సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వంతెన వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎస్ దినేష్ కుమార్, ఐటిడీఏ పీవో అభిషేక్ గౌడ్, జాయింట్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, జిసిసి చైర్మన్ కె శ్రావణ్ కుమార్ ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం జోనల్ చైర్మన్ ఎస్ దొన్నుదొర, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, స్థానిక మండల ఎంపీపీ జడ్పిటిసి బిఈశ్వరి, సిహెచ్ జానికమ్మ, సర్పంచ్ సుబ్బారావు, ఇంజనీరింగ్ అధికారులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

డిఎస్‌సిలో ఆదివాసీలకు అన్యాయం

సిపిఎం ఆధ్వర్యాన ఆందోళన

అరకులోయలో నిరసన తెలుపుతున్న నాయకులు

ప్రజాశక్తి-అరకులోయరూరల్: రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన మెగా డిఎస్సి నోటిఫికేషన్‌లో ఆదివాసి నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం చేసిందని సిపిఎం మండల కార్యదర్శి కె రామారావు అన్నారు. ఆదివారం అరకులోయ మండల కేంద్రంలో సిపిఎం ఆధ్వర్యంలో నాలుగు రోడ్డు జంక్షన్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ, అరుకులో రా కదలిరా ఎన్నికల ప్రచార సభలో చంద్రబాబు నాయుడు జీవో 3 పునరుద్ధరణ చేసి గిరిజన యువతకు 100 శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించే విధంగా కూటమి ప్రభుత్వం తీసుకుంటుందని హామీ ఇచ్చి నేడు అధికారంలోకి వచ్చిన తర్వాత మాట మార్చాలని ఇది ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి గిరిజన ప్రత్యేక డిఎస్సి నోటిఫికేషన్ విడుదల గిరిజన నిరుద్యోగులతో ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. జీవో 3 రద్దు చేయడంతో వేలాదిమంది బిఈడి, పీజీ, డిగ్రీ ఎంటెక్, బిటెక్ చదివి ఖాళీగా ఉన్నారని అన్నారు. గిరిజనులకు రిజర్వేషన్ కల్పించకుండా మైదాన ప్రాంతానికి చెందిన గిరిజనేతరులకు అధిక శాతం పోస్టులు కేటాయించడం ఎంతవరకు సమంజసం అని మండిపడ్డారు. తక్షణమే చంద్రబాబు నాయుడు అరకు ఎన్నికల సభలో ఇచ్చిన హామీ ప్రకారం జీవో 3 పునరుద్ధరణ చేసి గిరిజన ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి గిరిజనులతోనే పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు కిల్లో జగన్నాథం, గెమ్మెలి చిన్నబాబు, పాంగి రామన్న, సిహెచ్ గురుమూర్తి, పాంగి నాని బాబు, సిహెచ్ ప్రసాద్ వంజంగి, మదన్ పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు : మెగా డిఎస్సి నోటిఫికేషన్‌లో ఆదివాసి నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం చేసిందని మండలంలోని బంగారుమెట్ట పంచాయతీ మాలగుమ్మి గ్రామంలో ఆదివాసి నిరుద్యోగల యువత, డిఎస్‌సి అభ్యర్థులతో ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి కొర్ర నరసయ్య ఆధ్వర్యంలో సోమవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి కె నర్సయ్య మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీని విస్మరించడం దారుణమన్నారు.ఆదివాసి ప్రత్యేక డీఎస్సీ నోటిపికేషన్ విడుదలకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని , నూటికి నూరు శాతం ఉద్యోగ ఉపాధి కల్పనకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ స్పెషల్ డిఎస్సీ నోటిఫికేషన్ విడుదలకు ప్రత్యేక ఆర్డినెన్స్ జారీ చేయాలని కోరారు. లేనిపక్షంలో గిరిజన నిరుద్యోగ యువతీ, యువకులతో పోరాటానికి వెనుకాడబోమని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు కె శ్రీను, ఆర్ దేవన్న , కె నాగరాజు, నిరుద్యోగులు చందు, బోసు సుబ్బారావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టులో నిరసన తెలుపుతున్న నాయకులు

నేడు చైర్‌పర్సన్‌పై అవిశ్వాస బలపరీక్ష

ప్రజాశక్తి-యలమంచిలి

యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారిపై వైసిపి కౌన్సిలర్లు సమర్పించిన అవిశ్వాస తీర్మానంపై మంగళవారం ఉదయం 10 గంటలకు ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేసినట్లు కమిషనర్ ప్రసాదరాజు సోమవారం ప్రకటించారు. మున్సిపల్ కార్యాలయంలో నర్సీపట్నం ఆర్‌డిఒ వివి.రమణ ఆధ్వర్యంలో అవిశ్వాస తీర్మానంపై చర్చ జరుగుతుందని చెప్పారు.

వైసిపి తరుపున మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఎన్నికైన పిళ్లా రమాకుమారి రాష్ట్రంలో మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో కొద్ది నెలల క్రితం బిజెపిలో చేరారు. ఈ నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే రమణమూర్తి రాజు నేతృత్వంలో వైసిపి కౌన్సిలర్లు సమావేశమై మున్సిపల్ చైర్‌పర్సన్‌పై మార్చి 26వ తేదీన 18 మంది వైసిపి కౌన్సిలర్లు అవిశ్వాస నోటీసు అందజేశారు. దీనికి స్పందించిన జిల్లా కలెక్టర్, నర్సీపట్నం ఆర్‌డిఒ వివి.రమణను ప్రిసైడింగ్ అధికారిగా నియమిస్తూ ఏప్రిల్ 22వ తేదీన సమవేశం నిర్వహించి బలాబలాలు తేల్చాలని ఉత్తర్వులిచ్చారు. ఈ సమావేశంలో జరగాలంటే 17 మంది సభ్యులు హాజరు తప్పనిసరి. అయితే మెజార్టీ సభ్యులు సమావేశానికి డుమ్మా కొట్టించి అవిశ్వాసం వీగిపోయేటట్లు చేయడానికి చైర్‌పర్సన్ వర్గీయులు క్యాంపు రాజకీయాలు నిర్వహించారు. దీంతో కోరానికి సరిపడా 17 మంది కౌన్సిలర్లు హాజరయ్యే అవకాశం లేదని కూటమి నేతలు ధీమాగా ఉన్నారు.

ఈ నేపథ్యంలో 7వ వార్డు కౌన్సిలర్ కట్టమూరు సుజాతను ప్రజాశక్తి ఫోన్‌లో పలకరించగా తాను క్యాంపుకు వెళ్లలేదని చెప్పారు. చైర్‌పర్సన్‌కు వ్యతిరేకంగా అవిశ్వాసానికి అనుకూలంగా ఓటు వేస్తారా అని ప్రశ్నిస్తే జవాబివ్వకుండా ఫోన్ పెట్టేశారు. అధిక శాతం మంది వైసిపి కౌన్సిలర్లు డబ్బుకు అమ్ముడు పోయినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మంగళవారం చైర్‌పర్సన్‌పై అవిశ్వాస నోటీసుపై జరుగు సమావేశం కోరం లేకండా వీగిపోయే పరిస్థితి ఏర్పడే అవకాశం ఉందని పరిశీలకులు భావిస్తున్నారు.

బిందెడు నీటికి బోలెడు కష్టం

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి, నక్కపల్లి విలేకరి

వేసవిలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని, సరఫరాలో ఇబ్బందులు వస్తే వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లుచేయాలని, ప్రతి కుటుంబానికి రక్షిత మంచినీరు అందించాలని, కలెక్టర్ విజయకృష్ణన్ ఈ నెల 3వ తేదీన నిర్వహించిన సమీక్షలో గ్రామీణ నీటి సరఫరా విభాగ అధికారులను ఆదేశించారు. ఈ ఆదేశాలు కొత్తకాదనుకున్నారో, తాగునీటి సమస్యలు పాతవేననుకున్నారోగానీ గ్రామీణ నీటి సరఫరా అధికారులు చలించడం లేదు. ఈ సమస్యలూ రాష్ట్ర హోంశాఖ మంత్రి అనిత ప్రాతినిధ్యపు నియోజకవర్గంలో కొనసాగుతున్నాయి. జిల్లాలో పాయకరావుపేట నియోజకవర్గంలోని నక్కపల్లి మండలం చందనాడ పంచాయతీ తుమ్మలపేట, తమ్మయ్యపేట, అమలాపురం పంచాయతీలోని మూలపర్ర, డిఎల్.పురం పంచాయతీలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. ఎంతోకాలంగా తుమ్మలపేటలో తాగునీటి సమస్య ఉందని మహిళలు ప్రజాశక్తికి తెలిపారు. రామచంద్రాపురం నుంచి నీరు సరిగా సరఫరాచేయక కొబ్బరితోటలోని బావుల నుంచి, నడిచి వెళ్లలేనివారు ఊర్లో మోటారు ఉన్న ఇళ్ల నుంచి నీరు తెచ్చుకుంటున్నట్లు మాడుగుల రమణమ్మ తెలిపారు. చేతి బోర్ల నీరు పెద్దగా రావడంలేదు. జలజీవన్ మిషన్ కింద పైపులు వేస్తున్నపుడు దెబ్బతిన్న కుళాయి లైన్లను బాగుచేయలేదని గ్రామస్తులు చెప్పారు. జలజీవన్ మిషన్ కింద తవ్విన గోతులు కప్పలేదని తన ఇంటి బయట కర్రకు కట్టిన కుళాయి పైపును అమలకంటి నాగమణి చూపించారు. జలజీవన్ పనులు పూర్తిచేసి నీరు సరఫరా చేస్తే మాకీ తాగునీటి సమస్య తీరేదని గ్రామస్తులు అంటున్నారు. తమ్మయ్యపేటలో రెండ్రోజులకు ఒకసారి అరగంట పాటు కుళాయి నీరు ఇస్తున్నారని, అది కూడా ఏ సమయంలో వస్తుందో తెలీక బిందెలు పెట్టుకొని చూస్తున్నామని గొల్లపల్లి వరలక్ష్మి తెలిపారు. ఉన్న బోర్లలో ఉప్పునీరు వస్తోంది. జలజీవన్ మిషన్ కింద పైపులు వేసి ఆపేశారు. దాదాపు 150 కుటుంబాలున్న ఈ ఊర్లోని వీధి కుళాయిలకు ఒక లైన్‌లో నీరు వస్తే మరొక లైన్లో నీరు రాక, నీరు వచ్చిన చోట బిందెలు వరుసగా పెట్టుకొని నీరు పట్టుకుంటున్నారు.

మూలపర్రలో సుమారు 200 కుటుంబాలు మంచినీటికి అవస్థలుపడుతున్నాయి. బోర్లు నుంచి వచ్చే ఉప్పు నీరు వాడుకకు ఉపయోగిస్తున్నారు. అమలాపురం సమీపంలోని బోరు నీటిని టూ వీలర్‌పై మగవాళ్లు వెళ్లి చిన్నపాటి డ్రమ్ములతో తెస్తున్నారని సూరకాసుల ఆనంతలక్ష్మి చెప్పారు. డిఎల్.పురంలో జలజీవన్ మిషన్ కింద కొన్ని వీధుల్లో పైపులు వేసినా కుళాయిలు అమర్చి నీరు సరఫరా చేసేపని పూర్తిచేయలేదు. ఇక్కడ కూడా బోర్లలో నీరు తాగడానికి పనికిరావడంలేదు. కుళాయి నీరు రెండు, మూడు రోజులకు వస్తోందని గొల్లవీధికి చెందిన నకిలి దేవి తెలిపారు.

పిజిఆర్‌ఎస్‌కు 65 అర్జీలు

అర్జీలు స్వీకరిస్తున్న ఐటిడిఎ పిఒ, సబ్ కలెక్టర్

ప్రజాశక్తి-రంపచోడవరం : స్థానిక ఐటిడిఎ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్) కార్యక్రమంలో ఏజెన్సీ 7 మండలాల నుండి ప్రజలు తమ సమస్యలపై 65 దరఖాస్తులు సమర్పించారు. వీటిని రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం, సబ్ కలెక్టర్ కెఆర్.కల్పశ్రీ, ఐటీడీఏ ఏపీవో జనరల్ డిఎన్వి రమణ స్వీకరించారు. అర్జీలను పరిశీలించి వాటి పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అంబేద్కర్, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ యం.రుక్మాండయ్య, పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ షరీఫ్, ఎడియంహెచ్ఓ జి.శిరీష, ఉపాధి హామీ ఏపీడి జి.శ్రీనివాసరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఐ.శ్రీనివాసరావు, సుబ్బరాయుడు, రవికుమార్, తహశీల్దారు బాలాజీ, ఈవోపిఆర్డి పద్మ, సిడిపిఓ సంధ్యారాణి, పిఎఓ ఎల్.రాంబాబు, ఏడిఏలు సిహెచ్‌కెవి చౌదరి, కె.సావిత్రి, వెలుగు ఎపిడి దేగలయ్య, ఏయంఓ విజయ భాస్కర్, డిప్యూటీ తహశీల్దార్లు త్రిమూర్తులు, శ్రీధర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు పి.వెంకట రమణ, సాయి సతీష్, సుబ్బారావు, మల్లికార్జునరావు, డిప్యూటీ సర్వే ఆఫ్ ఇన్స్పెక్టర్ లక్ష్మణ్, డిడి ఆఫీస్ సూపరింటెండెంట్ బి.కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఏడుగురు జూదరుల అరెస్టు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : రాజవొమ్మంగి గ్రామ శివారులో పేకాట శిబిరంపై స్థానిక ఎస్ఐ నరసింహమూర్తి ఆధ్వర్యంలో సిబ్బంది సోమవారం దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న పదిమందిని అరెస్ట్ చేసి వారి వద్ద నుండి రూ.7830 నగదు, ప్లే కార్డ్స్ స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరసింహమూర్తి తెలిపారు.

25 కేజీల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-రోలుగుంట:25 కేజీల గంజాయిని అక్రమంగా తరలిస్తూ నలుగురు నిందితులు పట్టుబడ్డారని కొత్తకోట సీఐ జీ.కోటేశ్వరరావు తెలిపారు. రోలుగుంట మండలం దిబ్బలపాలెం గ్రామానికి చెందిన చవ్వాకుల చిన్నమ్ములు ఏజెన్సీ ప్రాంతంలో గంజాయి కొనుగోలు చేసి తన ఇంటి వద్ద నిల్వ చేసి చిన్న చిన్న ప్యాకెట్ల రూపంలో గంజాయి తాగేవారికి అమ్ముతూ ఉంటుంటాడన్నారు. జే.నాయుడుపాలెం గ్రామానికి చెందిన వడ్డాది సాయి, బంగారు పవన్‌ల సహాయంతో మద్దిగరవు ప్రాంతానికి వెళ్లి పెదబయలు మండలం తగ్గుపాడు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వద్ద 25 కేజీల గంజాయిని కొనుగోలు చేసి మైదాన ప్రాంతానికి ద్విచక్ర వాహనాలపై తీసుకుని వస్తుండగా కొంతలం జంక్షన్ వద్ద అదుపులోకి తీసుకొని వారిని అరెస్ట్ చేయడం జరిగిందన్నారు. వారి వద్ద నుంచి రెండు ద్విచక్ర వాహనాలు, నాలుగు సెల్ ఫక్షన్లు స్వాదీనం చేసుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రామకృష్ణారావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-ఆనందపురం : మామిడిలోవ జాతీయ రహదారి వద్ద సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. అందిన సమాచారంతో ఇన్‌ఛార్జి విఆర్‌ఓ మల్లు దొర అక్కడకు చేరుకుని, స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. మృతి చెందిన వ్యక్తి యాచకుడుగా గుర్తించారు. ప్రమాదంలో శరీర భాగాలు నుజ్జునుజ్జు అయ్యాయి. సంఘటనా స్థలానికి చేరుకున్న ఆనందపురం సీఐ. సిహెచ్ వాసునాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ గంట్యాడ సంతోష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మంత్రి దృష్టికి నియోజకవర్గ సమస్యలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కూమార్‌లను సోమవారం పాడేరులో కలిసి రంపచోడవరం నియోజకవర్గంలోని నెలకొన్న పలు సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లినట్లు రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షులు మఠం విజయభాస్కర్ తెలిపారు. రాజవొమ్మంగి మండలం కిర్రాబు ఆనకట్ట నిర్మాణానికి చర్యలు చేపట్టాలని, రంపచోడవరం, చింతూరు కేంద్రాల్లో అన్నా క్యాంటీన్‌లను త్వరితగతిన ఏర్పాటు చేయాలని కోరారు. ఈ మేరకు పలు సమస్యలతో కూడిన వినతిపత్రాలను వారికి అందజేశారు. వీటిపై మంత్రి సంధ్యారాణి సానుకూలంగా స్పందించారు. అల్లూరి జిల్లా ఎస్పీ అమిత్ బర్ధార్‌ను కూడా ఎమ్మెల్యే శిరీషదేవి విజయభాస్కర్ దంపతులు మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గంలోని 11 మండలాల లా అండ్ ఆర్డర్‌పై వివరించారు.

మంత్రి సంధ్యారాణి సమస్యలు విన్నవిస్తున్న ఎమ్మెల్యే శిరీషాదేవి

15 రోజుల్లో 'ఉపాధి' వేతనాలు చెల్లించాలి

పనిప్రదేశంలో కూలీలతో మాట్లాడుతున్న సిపిఎం కార్పొరేటర్ గంగారావు

ప్రజాశక్తి -తగరపువలస : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలోని నిబంధనల మేరకు పనిచేసిన కూలీలందరికీ 15 రోజుల్లోగా వేతనాలు ఇవ్వాలని జివిఎంసిలో సిపిఎం ఫ్లోర్‌లీడర్ డాక్టర్ బి.గంగారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం భీమిలి మండలం

జివిఎంసిలో సిపిఎం ఫ్లోర్‌లీడర్ డాక్టర్ గంగారావు

రేఖవానిపాలెం, మూలకుద్దు గ్రామ పంచాయతీల్లో జరుగుతున్న ఉపాధి పనులను పార్టీ జోన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్ మూర్తితో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పనిప్రదేశంలో టెంట్లు, తాగునీరు, మెడికల్ కిట్లు, ఇతర సౌకర్యాల లేమి, వేతనాల చెల్లింపులో జాప్యంపై పలువురు కూలీలు సిపిఎం నేతల దృష్టికి తెచ్చారు.

ఈ సందర్భంగా గంగారావు మాట్లాడుతూ, ఉపాధి చట్టం కింద జాబ్‌కార్డున్న కుటుంబానికి ఏడాదికి 200 రోజుల పాటు పని కల్పించాలని, ఎంతో మంది పని చేయడానికి సిద్ధంగా ఉన్న నేపథ్యంలో వారందరికీ జాబ్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బడ్జెట్‌లో నిధుల కేటాయింపులు కోత పెట్టి, కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తోందని మండిపడ్డారు. పార్టీ జోన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ, చట్టంలోని నిబంధనల మేరకు పని ప్రదేశాల్లో అన్ని సౌకర్యాలతోపాటు కూలీలకు వేసవి అలవెన్స్, ఉచిత పనిముట్లు మునుపటిలా అందజేయాలని కోరారు. కార్యక్రమంలో ఐద్వా జోన్ కార్యదర్శి కె నాగరాణి, నాయకులు ఎస్ గున్న పాల్గొన్నారు

12 మోడల్ ప్రాథమిక పాఠశాలలు మంజూరు

ప్రజాశక్తి -పద్మనాభం : ప్రభుత్వ పాఠశాలలల్లో ప్రాథమిక స్థాయిలో విద్యార్థుల సంఖ్య పెంచడానికి, మెరుగైన విద్యాభివృద్ధి లక్ష్యంతో పద్మనాభం మండలంలో 12 ప్రాథమిక మోడల్ స్కూళ్లను ప్రభుత్వం మంజూరు చేసిందని, ఈ మేరకు జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ఉత్తర్వులు జారీ అయ్యాయని ఎంఇఒ టి.రమణ తెలిపారు. మోడల్ ప్రాథమిక పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు కొనసాగింపుతో పాటు తరగతికి ఒకరు చొప్పున పాఠశాలల్లో ఐదుగురు ఉపాధ్యాయులు తప్పనిసరిగా ఉంటారన్నారు.

అయితే విద్యార్థుల సంఖ్యను బట్టి మండలంలో మోడల్ స్కూళ్ల ఎంపిక జరిగిందన్నారు. కృష్ణాపురం, పద్మనాభం, రేవిడి, పాండ్రంగి, మద్ది, అనంతవరం, కె.కోవ్వాడ, గంధవరం, పొట్నూరు, రెడ్డిపల్లి, చిన్నపురం, బిఆర్ తాళ్లవలస. గ్రామాల్లో ఉన్న పాఠశాలను మోడల్ ఎలిమెంటరీ స్కూళ్లగా ఎంపిక చేశారన్నారు. దీనివల్ల పద్మనాభం మండలానికి అదనంగా 16 పోస్టులు మంజూరైనట్లు తెలిపారు.ఆయా గ్రామాల్లోని విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉక్కు కార్మికులపై యాజమాన్యం కక్ష సాధింపు

ప్రజాశక్తి -గాజువాక : నెలసరి వేతనాలు, ఇతర ఆర్థికప్రయోజనాలను సకాలంలో చెల్లించక స్టీల్‌ప్లాంట్‌ఉద్యోగులు, కార్మికులపై యాజమాన్యం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని ఐఎన్‌టియుసి నేతలు ఆవేదన వ్యక్తం చేశారు సోమవారం హైదరాబాద్‌లో యూనియన్ జాతీయ అధ్యక్షుడు జి.సంజీవరెడ్డిని అతని నివాసంలో కలిసి సమస్యలను విన్నవించారు. పర్మినెంట్ కార్మికులకు జీతాలు చెల్లించడం లేదని, హెచ్‌ఆర్‌ఎ వంటి ఇతర అలవెన్సులు నిలుపుదల చేశారన్నారు. దీంతో సకాలంలో వేతనాలు, ఇతర ఆర్థిక ప్రయోజనాలు అందక కార్మికుల కుటుంబాలు, ముఖ్యంగా యువ కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అదనపు ఆర్థిక ప్రయోజనాలు కల్పించకపోగా, రేయింబవళ్లు కష్టపడి పని చేస్తున్న కార్మికులకు సకాలంలో జీతాలు చెల్లించలేదన్నారు. 1200మంది ఉక్కు కార్మికులను విఆర్ఎస్ ద్వారా ఇంటికి సాగనంపారని, రెండు వేలమందికి పైగా కాంట్రాక్ట్ కార్మికులను అక్రమంగా విధుల్లోంచి తొలగించారన్నారు. మరో రెండు వేల మందిని పైగా తొలగిస్తామని ఆర్ఎల్‌సి లేబర్ కమిషన్ ముందే యాజమాన్యం చెప్పడం దారుణమన్నారు. నీరుకొండ రామచంద్రరావు ఉన్నారు.

వికలాంగులకు ఉపకరణాల పంపిణీ

ప్రజాశక్తి-రంపచోడవరం : ఆంధ్రప్రదేశ్ విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ సంస్థ ఆధ్వర్యాన స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో సోమవారం వికలాంగుల ఉపకరణాల గుర్తింపు, పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. రంపచోడవరం మండలం నుండి 66 మంది, దేవీపట్నం నుండి 82 మంది, గంగవరం నుండి 18 మందికి ఉపకరణాలు అందించారు.

18 నుండి 45 సంవత్సరాల మధ్య వయసుగల, వివిధ శిక్షణల యందు ఆసక్తి కలిగిన సుమారు 45 మందిని ఎంపిక చేయడం జరిగిందని, వారికి వివిధ అంశాలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు ఈ కార్యక్రమంలో జిల్లా వికలాంగుల అసిస్టెంట్ డైరెక్టర్ జే మాధవి, రంపచోడవరం ఎంపీడీవో సుండం శ్రీనివాస్ దొర తదితరులు పాల్గొన్నారు..

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

ప్రజాశక్తి-రంపచోడవరం : వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తుగా చర్యలు తీసుకుంటున్నట్లు మండలం కామేపల్లి పంచాయతీ సర్పంచ్ మిర్తివాడ ఆనందరెడ్డి అన్నారు. సోమవారం గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో మరమ్మతులకు గురైన చేతిపంపులను బాగు చేయించడం జరుగుతుందని చెప్పారు. దోమల నివారణ మందు కూడా పిచికారీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు కుంజం వంశీ, పీసా ఉపాధ్యక్షుడు వేమన్న కార్యదర్శులు కొండయ్య, రమణారెడ్డి, వార్డు మెంబర్లు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహంలో తనిఖీలు

విద్యార్థుల నుంచి వివరాలను సేకరిస్తున్న కమిటీ సభ్యుడు బాలు

ప్రజాశక్తి-రంపచోడవరం : స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ వసతి గృహాన్ని జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు అకిసా బాలు సోమవారం సందర్శించి తనిఖీలు చేశారు. విద్యార్థులకు మెనూ అమలు చేస్తున్నాది లేదీని ఆరా తీశారు. మెనూ ప్రకారం విద్యార్థులకు ఇవ్వవల్సిన సరుకులు మిగిల్చుకొని అర్ధరాత్రి సమయంలో వసతి గృహం నుండి ప్రైవేటు వాహనంలో బయటకు తరలించడం చాలా బాధాకరమని బాలు అక్కిస పేర్కొన్నారు. నేషనల్ కమిషన్ ఫర్ ప్రొడక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ వారి ఆదేశాల మేరకు ప్రతి స్కూల్లోనూ హాస్టల్లోనూ కంప్లైంట్ బాక్సులు పెట్టాలని సూచించారు. ఈ విషయాన్ని ఐటిడీఏ పీవో, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.

ఇంటర్ ఫెయిల్ విద్యార్థులకు 24 నుంచి ప్రత్యేక తరగతులు

ప్రజాశక్తి-విఆర్.పురం : ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులకు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 24 నుండి స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ పి.రాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24 నుండి ప్రతి రోజూ ఉదయం 9 నుండి సాయంత్రం 5 గంటల వరకు ఈ ప్రత్యేక తరగతులు జరుగుతాయని, విద్యార్థులకు ప్రభుత్వం మధ్యాహ్న భోజనం సదుపాయం కూడా ఏర్పాటు చేస్తుందని పేర్కొన్నారు. మే 12వ తేదీ నుండి అడ్వాన్స్‌డ్ సప్లిమెంట్ పరీక్షలు జరగనున్న నేపథ్యంలో పరీక్షలలో ఫెయిల్ ప్రథమ, ద్వితీయ ఇంటర్ విద్యార్థులందరూ ఈ తరగతులకు తప్పనిసరి హాజరై సద్వినియోగం చేసుకోవాలని కోరారు.